

డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత కోచింగ్

ప్రజాశక్తి-కాకినాడ

డిఎస్‌సి-2025 అభ్యర్థులకు ఉచితంగా కోచింగ్ అందించనున్నట్లు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన కాకినాడలో క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 16, 347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్‌సి నిర్వహిస్తోందన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఆర్థికంగా వెనకబడిన నిరుద్యోగ యువత శిక్షణకు వేలాది రూపాయలు వెచ్చించలేక ఇబ్బందులు పడుతున్నారని, దీని అధిగమించి నిరుద్యోగ యువతను ప్రోత్సహించేందుకు కాకినాడలో ప్రసిద్ధి చెందిన శ్యామ్ ఇనిస్టిట్యూట్ ద్వారా అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా మెరుగైన శిక్షణతో పాటు డైలీ టెస్ట్ సిరీస్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

ధాన్యం సేకరణ లక్ష్యాలు పెంపు

- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం
- సమీక్షా సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యాలను పెంచామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడ జిల్లాకు 50 వేల టన్నులు బొండాలు రకం, బిఆర్ కోనసీమ జిల్లాకు లక్ష టన్నులు, తూర్పు గోదావరి జిల్లాకు ఇప్పటికే పెంచిన 30 వేలకు అదనంగా మరో 50 వేలు సేకరణ లక్ష్యాలను పెంచామని తెలిపారు. అలాగే అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. కాకినాడలోని కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాల్లో కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధ్యక్షతన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల జెసిలు, ప్రజాప్రతినిధులు, రైసుమిల్లలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. రబీలో ధాన్యం సేకరణలో ఎదురౌతున్న సమస్యలపై ఆయా ప్రజా ప్రతినిధులు, అధికారులు మంత్రికి వివరించారు. అకాల వర్షాల వల్ల పంట నష్టం, రైతులు ఇబ్బందులను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

కాకినాడ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రగతిని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా వివరించారు. ట్రాన్స్ పోర్ట్ కోసం ఉపయోగించే ట్రైలర్ల సర్టిఫికేషన్‌కు తీవ్ర జాప్యం జరుగుతోందని ఎంఎల్‌ఎలు తెలిపారు. రవాణా శాఖ అధికారలతో చర్చించి పరిష్కరిస్తామని జెసి తెలిపారు. అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న ధాన్యానికి మద్దతు ధర ప్రకారం పరిహారం అందించాలని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ కోరారు. బొండాలు రకం బాయిల్డ్ రైస్ సేకరణకు ఎఫ్‌సిఐ పర్మిషన్ కోసం కోరామని, పర్మిషన్ వచ్చే లోపు కొనుగోళ్లు కొనసాగించాలని పౌర సరఫరాల సంస్థ ఎమ్‌డి డాక్టర్ మనజీర్ జిలానిసామ్యూల్ మిల్లర్లను కోరారు. రైతుల నుంచి ఎంత ధాన్యమైనా కొనడానికి సిద్ధంగా ఉన్నామన మిల్లరు తెలిపారు. ఎఫ్‌సిఐలో మాన్యుయల్ గ్రెయిన్ ఎనాలసిస్ వల్ల రిజెక్షన్ ఎక్కువగా ఉంటుందన్నారు. ఆటోమేటిక్ అనాలసిస్ అమలు చేసేలా చూడాలి మిల్లర్లు కోరారు. అలాగే డైలీ టార్గెట్ విధానాన్ని సడలించాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పంట కోతల సమయాల్లో తేడాలు ఉన్నందున రైతుసేవా కేంద్రాల లక్ష్యాలను సవరించాలని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు కోరారు. అలాగే గతంలో ఉమ్మడి జిల్లాలో కొనుగోళ్లు నిర్వహించిన డ్వాక్రా సంఘాలకు పెండింగ్ ఉన్న సుమారు రూ.16.75 లక్షల కమిషన్ చెల్లించాలని మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు.

తూర్పుగోదావరి జిల్లాలో మూడు ప్రాజెక్టుల కింద పంటలు సాగవుతున్నాయని, గోకవరం మండలంలో రైస్ మిల్లులు లేవని, అందువల్ల ప్రభుత్వ పరంగా కొనుగోళ్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ కోరారు. పెదపూడి మండలం రైతుల ధాన్యాన్ని సమీపంలో ఉన్న బిక్కవోలు మండలం రైస్ మిల్లులకు కాకుండా కాకినాడ జిల్లాలోని మిల్లులకు టై అప్ చేయడం వల్ల రైతులు రవాణా సమస్య ఎదుర్కొంటున్నారని అనపర్తి ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంత్రి దష్టికి తెచ్చారు. అలాగే సియంఆర్ బ్యాంకు గ్యారెంటీనీ 1:1 కాకుండా 1:2 నిష్పత్తికి మార్చాలని అన్ని జిల్లాల మిల్లర్లు కోరారు.

అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎన్నడూ లేని విధంగా గడచిన 9 నెలల్లో 49.45 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు. రూ.11,400 కోట్లను రూపాయలు రైతుల ఖాతాల్లో 24 గంటల్లో జమ చేశామన్నారు. అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యం అంతా కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం నిమ్ము 22 శాతం వరకూ ఉన్నా కొనుగోళ్లు జరపాలని అధికారులకు ఆయన ఆదేశించారు. వర్షాల వల్ల పంటనష్టంపై ఎన్యూమరేషన్ ప్రక్రియ వెంటనే చేపట్టాలని కలెక్టర్లను అదేశించామని తెలిపారు. రైతులతో పాటు మిల్లర్ల హితం కూడా ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందన్నారు. రైతులకు అండగా నిలిచే ప్రభుత్వ కృషిలో మిల్లర్లు పూర్తి సహకారం అందించాలన్నారు. అన్ని జిల్లాల్లో ఇకపై బ్యాంకు గ్యారంటీనీ ప్రమాణికంగా 1:2గా అమలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్‌ఎలు పంతం నానాజీ, దాట్ల సుబ్బరాజు, వనమాడి కొండబాబు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జెసి టి.నిశాంతి, తూర్పుగోదావరి జిల్లా జెసి ఎస్.చినరాముడు, మూడు జిల్లాల రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు నున్నరామకష్ణ, కర్రి వెంకటరెడ్డి, సిహెచ్‌వివివిఎస్ఎస్.చౌదరి, పౌర సరఫరాల సంస్థల జిల్లా మేనేజర్లు, పౌరసరఫరాల అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

పేదల వైద్య సేవలకు సహకారం

ప్రజాశక్తి-కాకినాడ

వేలాది మందికి వైద్య సేవలు అందిస్తున్న కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రికి కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ రూ.55 లక్షలతో సామగ్రి అందజేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి పేర్కొన్నారు. సామాజిక బాధ్యత కింద కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్ ప్రజా సంక్షేమార్థం విరాళంగా అందించిన 3 వెంటిలేటర్లను, 8 మల్టీపారా మానిటర్లు, 8 ఐసియు పడకలు, 8 గైనకాలజీ పరిశీలన బెంచీలను సోమవారం జిజిహెచ్ ట్రామా కేర్‌లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎంఎల్‌సిలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్‌ఎలు వనమాడి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు మర్రెడ్డి శ్రీనివాసు, కేఎస్పీఎల్ ఎండి కె.వి.రావు తదితరులు ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిజిహెచ్‌కు సంబంధించి సంవత్సర కాలంలో రూ.55 లక్షలతో సామగ్రి సమకూర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలకు విరివిగా వైద్య సేవలు అందిస్తున్న జిజిహెచ్ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు కేఎస్పీఎల్ గొప్ప తోడ్పాటును అందించిందని కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వైద్య సేవలు అందించడంలో కాకినాడ జిజిహెచ్ రాష్ట్ర స్థాయిలోనే మంచి పేరు సంపాదించుకుందని, ఈ ఆసుపత్రి మరింత అభివద్ధి చేయడానికి ప్రభుత్వం కషి చేస్తుందని దీనితో పాటు జిల్లాలోని ఇతర ఆసుపత్రుల అభివద్ధికి తమ సహాయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగైదు జిల్లాల నుంచి ప్రజలు నిత్యం జిజిహెచ్‌కు వైద్య సేవల నిమిత్తం వస్తూ ఉంటారన్నారు. గత సంవత్సరంలో 8 లక్షల మంది ఔట్ పేషెంట్లు, 17 వేల మంది ఇన్ పేషెంట్స్ వైద్య సేవలు పొందగా సుమారుగా 45 వేల సర్జరీలు జిజిహెచ్ ద్వారా జరిగాయని ఎంపీ తెలిపారు. జిజిహెచ్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులుగా తాము, అధికారులు తమ వంతు బాధ్యతగా చిత్తశుద్ధితో కృషి చేసినట్టు తెలిపారు. రంగరాయ వైద్య కళాశాలకు టీచింగ్ ఆసుపత్రిగా జిజిహెచ్ అనుబంధంగా పనిచేస్తూ భవిష్యత్తు తరాలకు వైద్య సేవలను అందించే వైద్యులను అందిస్తుందన్నారు. క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్న నేపథ్యంలో త్వరలో జిజిహెచ్‌లో ప్రత్యేక క్యాన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్.విఠల్, కేఎస్పీఎల్ సిఇఒ మురళీధర్, వివిధ విభాగాల వైద్య అధికారులు పాల్గొన్నారు.


వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, ఎంపీ శ్రీనివాస్

ధాన్యాన్ని పరిశీలించిన మాజీ ఎంపీ గీత

ప్రజాశక్తి-పిఠాపురం

అకాల వర్షంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని మాజీ ఎంపీ, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంగా గీత డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రాపర్తి, రాయవరం గ్రామాలలో తడిసిన ధాన్యాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర, ధాన్యం సేకరణ విషయంలో కాలయాపన వల్ల అకాల వర్షం రైతాంగాన్ని మరింత నష్టపరిచిందన్నారు. అకాల వర్షం కారణంగా ధాన్యం తడవడంతో రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతాంగాన్ని తక్షణం ఆదుకోనే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రావుల మాధవరావు, అడపా రఘు, వైసిపి కాకినాడ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, కె.దత్తుడు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌ను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట

కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న ప్రధాని సూర్య ఘర్ పథకాన్ని పట్టణ ప్రజలంతా వినియోగించుకునేలా మెప్మా సిబ్బంది అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య పిలుపునిచ్చారు. సామర్లకోట మెప్మా కార్యాలయంలో ఆర్‌పిలకు ప్రధాన మంత్రి సూర్యఘర్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సామర్లకోట టౌన్ ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్తు పరికరాల అమెరికాపై, సోలార్ విద్యుత్ వినియోగంపై, ప్రభుత్వం కల్పిస్తున్న సబ్సిడీపై వివరించే అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఎంఎం హుస్సేన్, సివోలు పాల్గొన్నారు.


సమ్మె నోటీస్ అందిస్తున్న నాయకులు

సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

మే 20న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ మేడిశెట్టి వెంకట రమణ విజ్ఞప్తి చేశారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారుకు వారు సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ 11 కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మెకు పిలుపు ఇచ్చాయని తెలిపారు. ఈ సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొనాలని ఆరోజు ప్రభుత్వ కార్యక్రమాలు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. నాలుగు లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే కార్మికులు మరింత కట్టు బానిసలుగా పని చేయాల్సిన పరిస్థితులు వస్తాయని. ఈ లేబర్ కోడ్స్‌ను ఎంత మాత్రం సహించేది లేదన్నారు. కార్మికులకు కనీస వేతనాలు నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, ఇది అన్ని రంగాల కార్మికులకూ అమలు చేయాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు.

కార్టూ'నిజం'



ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా పెంపు

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

వర్షానికి ఈదురు గాలులకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వైసిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో అరటి, మామిడి, జీడి మామిడి పంట ఇటీవల కాలంలో బీభత్సమైన గాలులు వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారని తక్షణమే అధికారి యంత్రాంగం నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులు నష్టపోయిన నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో రైతులు పండించిన ధాన్యానికి అప్పటి వైసిపి ప్రభుత్వం రూ.రెండు వేలకు ధాన్యం కొనుగోలు చేస్తే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ధాన్యాన్ని కొనుగోలు చేసే నాథుడే కరువయ్యారని, తక్షణమే రైతుకు గిట్టుబాటు ధర కల్పించి రైతు నుంచి ధాన్యాన్ని కనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.


సిబ్బందితో సమీక్షిస్తున్న జిలానీ సమూన్

సివిల్ సప్లయిస్ ఎమ్‌డీకి రైతుల మొర

ప్రజాశక్తి -సామర్లకోట

రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా రైతు సేవా కేంద్రాల ద్వారా పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేలా చూడాలని పలువురు రైతులు ఎపి సివిల్ సప్లై వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మేనేజర్ జిలాని సమన్‌కు మొర పెట్టుకున్నారు. అచ్చంపేటలో రైతు సేవా కేంద్రాన్ని ఎపి సివిల్ సప్లయ్ విసి, మేనేజింగ్ డైరెక్టర్ మేనేజర్ జిలానీ సమూన్ సోమవారం సందర్శించి పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ఏ విధంగా జరుగుతుంది, తేమశాతం, నాణ్యతా ప్రమాణాలు గురించి ధాన్యం కొనుగోలు సిబ్బందిని ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.సత్య, తహశీల్దారు కె.చంద్రశేఖర్ రెడ్డి, గ్రామానికి చెందిన రైతులు వీరంరెడ్డి వసంత రాయుడు (పెదబాబు), సలాది రమేష్, యాళ్ల కాశీ విశ్వనాథం, ముమ్మిడి శ్రీనివాసు, ముమ్మిడి సూరిబాబు పాల్గొన్నారు.

వైసిపి బిసి సెల్ సభ్యునిగా గొల్లు వెంకటరమణ

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని ఎస్.పైడిపాలకు చెందిన గొల్లు వెంకటరమణ వైసిపి బిసి సెల్ సభ్యునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణను జెడ్‌పిటిసి గోళ్ల లక్ష్మణమూర్తి, వైసిపి నాయకులు వాసిరెడ్డి జమీలు, వాసిరెడ్డి భాస్కర్ బాబు, వైసిపి మండల అధ్యక్షుడు చింతకాయల వీర వెంకట సత్యనారాయణ, వైసిపి నాయకులు సర్మం శ్రీను, జిగిరెడ్డి సత్తిబాబు అభినందించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబుకు వెంకటరమణ కృతజ్ఞతలు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్, పెద్దాపురం

రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం కాకినాడ రూరల్ మండలం చీడిగ, పెద్దాపురం మండలం జె.తిమ్మాపురం, జగ్గంపేట మండలం కాట్రావల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా రైతులకు అపార నష్టం కలిగిందన్నారు. ఈ వర్షాల వల్ల నష్టపోయిన ప్రతి రైతును కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం బాధ్యత తీసుకుని కొనుగోలు చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని బట్టి హడావిడిగా రైతులు ఎవరూ తొందరపడి దళారులు, మధ్యవర్తులకు తక్కువ ధరకు తమ ధాన్యాన్ని అమ్ముకోవద్దని సూచించారు. కాకినాడ జిల్లాలో ఇప్పటివరకు రైతు సేవా కేంద్రాల ద్వారా 59 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కనుగోలు చేయడం జరిగిందన్నారు. 95 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న కనీస మద్దతు ధరకు మాత్రమే ప్రతి ఒక్క రైతు ధాన్యాన్ని అమ్ముకోవాలని ఆయన తెలిపారు. గత సంవత్సరం వైసిపి ప్రభుత్వంతో పోల్చుకుంటే 11 లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా కూటమి ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారి రూ.11,300 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. కాకినాడ జిల్లాలో 225 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సిబ్బందితోపాటు గోనె సంచలను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఈ పర్యటనలో ఆయన వెంట జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి, కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ పంతం నానాజీ, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, మాజీ ఎంఎల్‌ఎ పెండెం దొరబాబు పాల్గొన్నారు.


పెద్దాపురంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

రెడ్‌క్రాస్ శిక్షణా తరగతుల ముగింపు

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించినట్టు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల రాష్ట్ర స్థాయి సదస్సు ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడి.రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా యూత్ రెడ్ క్రాస్ స్టేట్ క్యాంప్ నిర్వహించామన్నారు. నేర్చుకున్న విషయాలను సమాజ సేవకు వినియోగించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్యాంపును తమ కళాశాలలో నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ క్యాంపు ద్వారా విద్యార్థులు తెలుసుకున్న విషయాలను తమ వ్యక్తిగత, సమాజ శ్రేయస్సుకు వినియోగించుకోవాలని తెలిపారు. జెఎన్‌టియుకె విసి ప్రొఫెసర్ సిఎస్ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ ఐఆర్‌సిఎస్ గొప్ప లీడర్స్‌ను తయారు చేస్తోందన్నారు. అనంతరం వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందించారు. విద్యార్థులకు శిక్షణ అందించిన వారికి కాకినాడ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్, డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, సెక్రటరీ కె.శివకుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కరుణ, ఐఆర్‌సిఎస్ సభ్యులు జి.శివరామకృష్ణ, నోడల్ ఆఫీసర్ తేజేశ్వరరావు, కో ఆర్డినేటర్లు ఎస్.దుర్గాదేవి, ఎస్.సత్యనారాయణ, ఎస్.మల్లేశ్వరరావు, వి.చిరంజీవి, వి.నాగరాజు, వాలంటీర్లు పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల్లో పాల్గొన్న రెడ్ క్రాస్ సభ్యులు, విద్యార్థులు

లబ్ధిదారులకు భూములివ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను లబ్ధిదారులకు తిరిగి ఇప్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బి.సురేష్ డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములను చట్ట ప్రకారం అప్పగించాలని కొన్ని భూములను సర్వే చేయాలని రీసర్వే డిటి వీరబాబుకు వారు సోమవారం వినతిపత్రం అందజేశారు. అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేసిన కొందరు అసలైన లబ్ధిదారులను బెదిరిస్తున్నారని, బెదిరిస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతమూల, పటవల ప్రాంతాలలో చాలా ఏళ్ల నుండి భూములు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూముల లబ్ధిదారులకు పట్టాలు ఇప్పించాలని అన్నారు. 445 సర్వే నెంబర్‌లో 8 మంది, 42/ 19 బి సర్వే నెంబర్ లో 11 మంది, 36 సర్వే నెంబర్‌లో 8 మంది, 95 సర్వే నెంబర్‌లో 17 మంది, 93 సర్వే నెంబర్‌లో 13 మంది భూములు సాగు చేసుకుంటున్నారని, వారికి పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. 9/77 ప్రకారం వారి భూములను తిరిగి వారికి ఇప్పించాలని కోరారు.


అసైన్డ్ భూముల వివరాలను డిటికి వివరిస్తున్న నాయకులు

ఘనంగా మార్క్స్ జయంతి

ప్రజాశక్తి-పెద్దాపురం

కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కార్ల్ మార్క్స్ జయంతిని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఘనంగా నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి డి.క్రాంతి కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్లమార్క్స్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం చల్లా విశ్వనాథం మాట్లాడుతూ కారల్ మార్క్స్ సిద్ధాంతాల ద్వారానే ప్రపంచ ప్రజలందరికీ శ్రమ, పెట్టుబడి, అదనపు విలువ వంటి అంశాలు అవగతమయ్యాయన్నారు. మార్క్సిజం పిడివాదం కాదని, దేశ, కాల, భౌతిక, భౌగోళిక పరిస్థితుల ఆధారంగా శ్రమజీవుల చైతన్యంపై ఆధారపడే సోషలిజం స్థాపితం అవుతుందని ఆయన సిద్ధాంతీకరించారన్నారు. దారపురెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మార్క్స్ జీవితంలో పడ్డ కష్టాలను వివరించారు. ఈ సభలో సిపిఎం నేతలు సిరపరపు శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు, రొంగల సుబ్బలక్ష్మి, నరసింహమూర్తి, యాసలపు రమేష్, దారపురెడ్డి కృష్ణ తదితరులు ప్రసంగించారు.



మార్క్స్‌కు ఘనగా నివాళులర్పిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారం కోరుతూ ఆరు అర్జీలు

ప్రజాశక్తి - పెద్దాపురం, పిఠాపురం, కాజులూరు

పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయంలో కార్యాలయ ఎఒ మాధవరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 6 ఫిర్యాదులు అందాయని మాధవరావు తెలిపారు. వీటిలో విద్యుత్ శాఖకు సంబంధించి రెండు, సివిల్ సప్లయ్స్‌కి సంబంధించి ఒకటి, వ్యవసాయ శాఖకు సంబంధించి రెండు, భూమి కొలతలకు సంబంధించి ఒకటి ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వీటిని వెంటనే పరిశీలించి పరిష్కరించి ఫిర్యాదుదారులకు తెలియజేయాలని సంబంధిత శాఖలకు పంపించామన్నారు.

పిఠాపురం పట్టణంలోని పాడా కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 64 అర్జీలు వచ్చినట్టు పాడా పీడీ ఎ.చైత్ర వర్షిణి తెలిపారు. దీనిలో రెవెన్యూ -16, మునిసిపాలిటీ 24, ఇతరాలు 24 వచ్చాయని తెలిపారు. ఎపిడి వసంత మాధవి, తహశీల్దార్ గోపాల కృష్ణ పాల్గొన్నారు.

కాజులూరు రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు ఒద్రనాథ్ ఠాగూర్ గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు, ప్రజలు సమస్యలు పరిష్కరించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గ్రీవెన్స్ సెల్ ప్రతి సోమవారం ఏర్పాటు చేసిందన్నారు. గ్రీవెన్స్ లో మండల సర్వేయర్ నిరంజన్ రావు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి -కరప

వేళంగిలో ట్రస్ట్ ఆఫ్ బొండా అర్ధ శత దినోత్సవాన్ని పురస్కరించుకుని వెయ్యి మంది వృద్ధులు, మహిళలకు సోమవారం వస్త్రాలు పంపిణీ చేశారు. డాక్టర్ బొండా వెంకన్న రావు, ఆయన కుమారుడు డాక్టర్ బొండా సూర్యారావు, ప్రతి సంవత్సరం పేదలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, ఏర్పాటు చేసి పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తారు. వేళంగి చుట్టుపక్కల గ్రామల ప్రజలు పాల్గొని సేవలను స్వీకరించారు. ప్రముఖ సంఘ సేవకులు తలాటం రాము, అరుణ ఇండస్ట్రీస్ ఎండి చింత సుబ్బారెడ్డి, డాక్టర్ చక్రరావు, ట్రస్ట్ అధినేత బొండా వెంకన్న రావు సేవలను కొనియాడారు. ట్రస్ట్ డైరెక్టర్లు బోండా వీర వెంకట సత్యనారాయణ, లక్ష్మీ కుమారి, రాజ్ కుమార్, సూర్యారావు, హరిణి, అనిత రాణి పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు, చంద్రు వెంకన్న రావు, బొడ్డు భాస్కర రామన్, ఇళ్ల ఆవేష్, చంద్రు శ్రీధర్, మెర్ల రాజేంద్రన్, చంటి, బదిరెడ్డి వెంకన్న, గరగ జెమ్మి, అయ్యన్న, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న బోండా కుటుంబ సభ్యులు

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలోని 216 జాతీయ రహదారికి సమీపంలోలోని ఒక పంట కాలువలో గుర్తుతెలియని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణంలోని జాతీయ రహదారి తాటిపర్తి జంక్షన్ వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఒక మహిళ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. ఈ ప్రమాదంలో గాయపడిన మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తుని మండలం రాజుపేటకు చెందిన మహిళలు ఒక ఫంక్షన్‌కు ఆటోలో పిఠాపురం మండలంలోని గోర్స వెళుతుండగా ఆటోను ఒక ఢీకొని వెళ్ళిపోయింది గాయపడిన వారిని వెంటనే కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు సోమవారం తెల్లవారుజామున అరలంక రామలక్ష్మి(48) పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు అయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.



రమణయ్యకు నివాళులర్పిస్తున్న అధికారులు

దడాల రమణయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రథమ ప్రాంతీయ పరిపాలనాధికారి దడాల రమణయ్య రాఫెల్ 34వ వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెండా స్తంభం వద్ద నున్న ఆయన విగ్రహానికి ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, సిఐ అడలరసన్, ఎస్ఐ పునీత్‌రాజ్, ట్రాఫిక్ ఎస్ఐ నూకరాజు, దడాల మనోహర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కెఎల్‌వి.ప్రసాద్, నల్లా సూర్యప్రకాష్ రావు, రాజు, రమణయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



రోగులకు వైద్యశిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

152 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

జిసిఎం చర్చి ఆధ్వర్యంలో చివటం గ్రామంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 152 మందికి ఏలూరు ఆశ్రమ్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించారు. చర్చి నిర్వాహకులు టి.అబ్బులు మాట్లాడుతూ అవసరమైన అందరికీ మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. 25 మందిని శస్త్ర చికిత్సలకు రిఫర్ చేసినట్టు జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ పి.కృష్ణలోకేష్ తెలిపారు. గురువారం వారిని ఆసుపత్రికి చెందిన బస్సులో తీసుకెళ్ళి, శస్త్ర చికిత్స అనంతరం తీసుకొస్తామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో ఆర్థో, న్యూరో, జనరల్ మెడిసిన్, గుండె, కంటికి సంబంధించిన వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బి.పవన్‌కుమార్, వి.భావన, శ్రీవల్లి, భరత్, డి.శ్రీనివాసరాజు, సిబ్బంది రాజేష్, పిఆర్ఓ శ్యాంసాగర్, టి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో నాణ్యమైన ఉత్పత్తులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రకతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తి జరగడంతో పాటు అధిక లాభాలు వస్తాయని, ప్రజలకు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు అందించొచ్చని వేగేశ్వరపురం గ్రామ సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు అన్నారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తైలం చంద్రశేఖర్, పెట్టా సుబ్బారావు, తైలం వీరవెంకట సత్యనారాయణలను సోమవారం ఆర్ఎస్‌కె ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అన్ని పంటలను ప్రకృతి సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగాంజనేయులు, అగ్రికల్చర్ అసిస్టెంట్ వరలక్ష్మి, ప్రకీతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గోదావరి నిషేధిత ప్రాంతాల్లో స్నానాలు ప్రమాదకరం

ప్రజాశక్తి- కొవ్వూరు

వేసవి సెలవులలో విద్యార్థులు స్నేహితులతో కలిసి ఉల్లాసంగా గడిపేందుకు చెరువులు, కాలువలు, గోదావరి నదుల్లో దిగి ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని, పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ డి.దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాపాన్ని తగ్గించుకునేందుకు పిల్లలు చెరువులు, కాలువలు, గోదావరి నదిలో దిగుతున్నారన్నారు. ఈత రాక ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. అనుమతులు లేని ప్రదేశాల్లో గోదావరి నదిలో స్నానాలు చేయడం ప్రమాదకరమన్నారు. మండలంలో పలు గోదావరి పరివాహక ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక ప్లెక్సీలను ఏర్పాటు చేశామన్నారు. తల్లిదండ్రులు పిల్లల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చిన్నారులకు తగిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు.



కాకినాడలో మ్యాజిక్ షో లో విద్యార్థులకు శిక్షణ

విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ

ప్రజాశక్తి-కాకినాడ, పెద్దాపురం

కాకినాడలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉపాధ్యాయులు వివిఎస్‌వి.రమణమూర్తి విద్యార్థులకు మ్యాజిక్, మ్యాథమెటిక్స్, మ్యాజిక్ షో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రకరకాల మ్యాజిక్స్ చేసి చూపించారు. విద్యార్థులతో పలు రకాల మ్యాజిక్ టెక్నిక్స్ చేయించి వారికి నేర్పించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు బి.సూర్యనారాయణ విద్యార్థులకు ఒరిగామి పేపర్ క్రాఫ్ట్ వర్క్ చేయించారు. ఎం.సత్యబాల, డిఆర్‌డిఎ సిబ్బంది విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి కె.కిషోర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది ఎస్.రాజు, టి.వీర్రాజు, ఎవిఎస్ నాగేంద్ర కుమార్, వి.అరుణ, కె.ప్రియదర్శిని, స్థానిక పాఠశాలల విద్యార్థులు 58 మంది పాల్గొన్నారు.

పెద్దాపురం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో సోమవారం విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చదవడం, తెలుగులో నామవాచకంపై అవగాహన కల్పించారు. గున్నం లక్ష్మీనారాయణ, లైబ్రేరియన్ పాలంకి నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో సాగులో లేని భూముల్లో ఉద్యాన పంటలు పండించే విధంగా రైతుల్లో అవగాహన పెంచాలని ఎంపిడిఒ డి.శ్రీలలిత అన్నారు. సోమవారం మండల కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె ప్రసంగించారు. మండల పరిధిలో ఉద్యాన పంటలు పండించేందుకు వీలుగా ఉన్న 350 హెక్టార్ల ను గుర్తించారన్నారు.ఈ 350 హెక్టార్లలో రైతులు ఉద్యాన పంటలు పండించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. మండల ఉద్యాన అధికారి ఎన్ సుజాత మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు చేసే రైతులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సహాయ సహకారాలు, సంక్షేమ పథకాలు వివరించారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయితీల కార్యదర్శి లు, సమన్వయ కమిటీల సభ్యులు ప్రతి గ్రామంలో సాగులో లేని భూములను గుర్తించి ఉద్యాన పంటల సాగు జరిగేలా కృషి చేయాలన్నారు. తాసిల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ రైతులందరూ వర్మి కంపోస్టును వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు.

సిఎంఆర్‌తో ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కాజులూరు

భారీ వర్షాలకు దెబ్బతిన్న ధాన్యాన్ని ప్రభుత్వం సిఎంఆర్‌లు ఓపెన్ చేసి తక్షణమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోలంక మాజీ సహకార సంఘం అధ్యక్షులు డివి.నరసింహరాజు డిమాండ్ చేశారు. రైతు కష్టానికి పంట చేతికందే సమయానికి పండిన పంటకి 35 శాతం మాత్రమే కొనుగోలు చేసి సిఎంఆర్ మూసి వేయడం ఎంతవరకు న్యాయం అని ఆయన ప్రశ్నించారు. గతంలో ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ లేదన్నారు. ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలు స్థాపించి పండిన ప్రతి గింజా ప్రభుత్వం కొనుగోలు చేసిన విధానాన్ని ఈ ప్రభుత్వం మర్చిపోయిందని చెప్పారు. తక్షణమే రైతు పండించిన ప్రతి గింజనూ ఈ ప్రభుత్వం సిఎంఆర్‌ల ద్వారా మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని కోరారు.ల

వాటర్ కూలర్ అందజేత

ప్రజాశక్తి-కాకినాడ

ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్‌కు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం రూ.లక్షా పది వేల విలువైన కూలర్‌ను అందించిన రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ 1978 ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని ఆర్‌టిసి మేనేజర్ మనోహర్ పేర్కొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన గుముడి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన వాటర్ కూలర్‌ను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ట్రస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ బాదం బాలకృష్ణ అధ్యక్షత వహించగా ట్రస్ట్ సెక్రటరీ నేమాని కళ్యాణి, ప్రసాద్ దంపతులు కూలర్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ జగన్నాథరావు, చీమకుర్తి పాపారావు, అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ వి.ధర్మారావు, ఎస్.స్వామి, విఆర్ఓ సిహెచ్.వెంకట్రాజు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ హై టెన్షన్ వైర్లు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వాలుతిమ్మాపురంలో తన పొలంలో విద్యుత్ హైటెన్షన్ వైర్లు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని ఆ గ్రామానికి చెందిన రైతు ఉరదాసు చిన్నరాజు సోమవారం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ మాధవరావుకు పిజిఆర్ఎస్‌లో విజ్ఞాపన పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనకు గ్రామంలో 3 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమి మీదుగా వెళ్లే విద్యుత్ వైర్లు క్రిందికి వేలాడుతున్నాయన్నారు. వ్యవసాయ పనుల సమయంలో ఈ వైర్లు దుక్కు దున్నే ట్రాక్టర్‌కు, పొలంలో పని చేసే వారికి తగిలే ప్రమాదం ఉందని, ఈ వైర్లు సరి చేయించాలని విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. త్వరలోనే వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయని, దీనిని దష్టిలో పెట్టుకుని ఈ విద్యుత్ వైర్లు సరి చేయించే చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి-గండేపల్లి

రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని పెదబ్రహ్మదేవం శ్రీ శారద రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ పిలుపు ఇచ్చారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 30వ సారి రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. రక్తం ఇచ్చిన తర్వాత నీరసం వస్తుందని శక్తి తగ్గిపోతుందని అనవసర అపోహలు చెంది రక్తదానం చేయడానికి వెనుకంజ వేస్తున్నారని, ప్రతి ఒక్కరూ సంవత్సరంలో కనీసం రెండు పర్యాయాలు రక్తదానం చేయవచ్చని ఆయన తెలిపారు.

కౌలుదారు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

రైతులకు కౌలు కార్డులు పారదర్శకంగా అందించాలని గొల్లప్రోలు తమశీల్దారు కెవివి.సత్యనారాయణ, వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. సోమవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో కౌలు రైతు కార్డులపై మండలంలోని విఎఒ, విఆర్‌ఒలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కౌలు రైతులను గుర్తించడంలో సిబ్బంది పారదర్శకతతో వ్యవహరించి రైతులకు త్వరితగతిన సకాలంలో కౌలు రైతు కార్డులు అందేలా చూడాలన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-కాజులూరు

వాహనదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని గొల్లపాలెం ఎస్ఐ మోహన్ కుమార్ తెలిపారు. సోమవారం గొల్లపాలెం కోళ్ల తూము సెంటర్లో పలు వాహనాలను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేని వాటికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మోహన్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల చోరీలు జరుగుతున్నాయని పలు వాహనాలు రికార్డులు లేకపోవడంతో కేసులు తరగతిగతిన చేయలేకపోతున్నామని దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ నిర్దేశించిన కేంద్రాల్లో నిఘా ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాలను, వాహనదారులకు జరిమానా విధిస్తున్నట్టు తెలిపారు.

బాక్సింగ్ విజేత మణికంఠకు ఘన సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఇటీవల జాతీయస్థాయి అండర్-19 యూత్ నేషనల్ బాక్సింగ్ పోటీలలో ప్రతిభ చాటిన మండలంలోని పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామానికి చెందిన పిల్లి మణికంఠను సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక పాఠశాల హెచ్‌ఎం కాశి రవీంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మణికంఠను ఘనంగా సత్కరించారు. గ్రామం నుంచి జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన మణికంఠ క్రీడా స్ఫూర్తిని ప్రశంసించారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ఆటలో మరింత రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులంతా మణికంఠను ఆదర్శంగా తీసుకుని చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంపన రామకృష్ణ, మార్కెట్ కమిటి మాజీ ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ, పిల్లి వీరనాగు, రాయుడు సింహాచలం, సూరంపూడి శ్రీనివాస్, అనసూరి శంకరుడు, బాదం ఏడుకొండలు, పితాని సత్తిబాబు, పిల్లి నూకరాజు, పిల్లి కుమారి, మేడిశెట్టి కుమారి, పిల్లి నాగమణి పాల్గొన్నారు.



మణికంఠను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆశాల సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో తామూ పాల్గొంటున్నామని డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సోమవారం సమ్మె నోటీసును అధికారులకు అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ వాటి స్థానంలో తీసుకొస్తున్న 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే20న దేశ వ్యాప్తంగా కార్మిక వర్గం సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఆశాలను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశాలుగా మార్పు చేయాలన్నారు. ఈ మేరకు జిఒలు విడుదల చేయాలన్నారు. నియమకాలను ప్రభుత్వమే చేపట్టాలన్నారు. చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్ల సాధన కోసం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశాలు అందరూ పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు జిల్లా వైద్య శాఖ అధికారులకు సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.అన్నామణి, అధ్యక్షురాలు, టి.నాగమణి, జి.బేబీకుమారి, కోశాధికారి టి.అనూష, ఎం.జయమ్మ, కె.నాగమణి, ఎం,కుమారి తదుతరులు పాల్గొన్నారు.



చిన్నారులకు స్పోర్ట్స్ సామగ్రిని అందిస్తున్న ఎస్‌పి నరసింహకిశోర్

చిన్నారుల్లో క్రీడా నైపుణ్యాల వెలికితీత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

చిన్నారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోలీస్, చిల్డ్రన్ సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపును నిర్వహిస్తున్నామని ఎస్‌పి నరసింహకిశోర్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీసు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్యాంపును ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే 31వరకూ ఈ క్యాంపు జరుగుతుందన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకూ కోచింగ్ ఉంటుందన్నారు. షటిల్, టెన్నిస్, క్రికెట్, వాలీబాల్, యోగాలో శిక్షణ ఇస్తామన్నారు. దీని కోసం ప్రతేకంగా పిఇటిలు, కోచ్‌లను నియమించాలన్నారు. ప్రతి రోజూ క్యాంపునకు హాజరయ్యే చిన్నారులకు రాగి జావ, కోడిగుడ్డు, అరటిపండు వంటి పౌష్టికాహారం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి(అడ్మిన్) ఎన్‌బిఎం.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్‌పి(లా అండ్ ఆర్డర్) ఎవి.సుబ్బరాజు, అడిషనల్ ఎస్‌పి(ఎఆర్) ఎల్.చించిరెడ్డి, డిఎస్‌పి(ఎస్‌బి) బి.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ (ఎస్‌బి) ఎ.శ్రీనివాసరావు, జోనల్ డిఎస్‌పిలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.రఘురాం పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-కడియం

తమకు పనులు కల్పించాలంటూ జేగురుపాడు కూలీలు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ కె.రమేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తమ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండు చేసినట్లు తెలిసిందన్నారు. అప్పటి నుంచి తమకు పనలు కల్పించట్లేదన్నారు. ఇటీవల కార్యాలయం నుంచి టెక్నికల్ అసిస్టెంట్ వచ్చి రెండు రోజులు పని చేయించారన్నారు. అయితే ఆన్‌లైన్‌లో హజరు నమోదు కాలేదని తలిపారు. గతంలో తాము చేసిన పనికి సంబంధించి పేస్లిప్ ఇచ్చేవారన్నారు. దాని వల్ల తాము చేసిన పని దినాలు తెలిసేవన్నారు. ప్రస్తుతం పేస్లిప్‌లు ఇవ్వట్లేదన్నారు. దీని వల్ల తాము నష్టపోతున్నామన్నారు. రెండు నెలల పాటు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

పలువురికి మాజీ ఎంఎల్ఎ చంటిబాబు పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని పలువురు వైసిపి నాయకులు మాజీ ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు సోమవారం పరామర్శించారు. గుమ్మళ్లదొడ్డికి చెందిన వైసిపి ఎస్‌సి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బులా అబ్బులు పాము కాటుకి గురై వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ని జ్యోతుల పరామర్శించారు. అలాగే అనారోగ్యానికి గురైన గోకవరానికి చెందిన షేక్ బాజ్జి, పదిలం అప్పారావులను ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు బిజ్జి రాజులను చంటిబాబు పరామర్శించారు. పితృవియోగంతో బాధపడుతున్న సయ్యద్ ఆలీషాను, తుమ్మలపల్లి నాని కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలాగే మాతృ వియోగానికి గురైన రంపఎర్రంపాలెం గ్రామానికి చెందిన కాళ్ల సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట దాసరి రమేష్, కర్రి సూరారెడ్డి, బిదిరెడ్డి రాంబాబు, కమ్మిల అచ్చిబాబు, తుమ్మల చిన్నబ్బులు, ఎస్.శ్రీను, బి.వీరచంద్రం తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎపిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి - కొవ్వూరు

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ అధికారి రవివర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దుర్గారావు హాజరై మాట్లాడారు. సంస్కరణల పేరుతో విద్యారంగంలో తీసుకొచ్చిన 117 జిఒను వెంటనే రద్దు చేయాలన్నారు. సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి సనపల రాజశేఖర్ మాట్లాడుతూ 12వ పిఆర్‌సిని నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ సలీం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను వెంటనే ఇవ్వాలన్నారు. పిఆర్‌టియు నాయకులు మద్దతు తెలిపారు. సీనియర్ నాయకులు షైక్ జానీ మాట్లాడుతూ తొమ్మిది రకాల పాఠశాలల విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ ధర్నాలో జిల్లా ఉపాధ్యక్షులు పి.గంగరాజు, మండల ప్రధాన కార్యదర్శి యాదం శంకరం, వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోనే లక్ష్య సాధన

తాళ్లపూడి : కోరుకున్న లక్ష్యాలను సాధించాలంటే అది విద్య తోనే సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులను మలకపల్లి గ్రామంలో సోమవారం దళిత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో మరపట్ల అరుణకుమార్ సత్కరించారు. వారికి ప్రోత్సాహక బహుమతులు, జ్ఞాపికలు అందించారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ ఉత్తమ విద్యార్థులకు నిర్వహించిన కెరీర్ గైడెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు తేవాలన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి అన్ని సమయాల్లోనూ తాను సహకారం అందిస్తానన్నారు. ఎస్.మోహన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అంబేద్కర్‌ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డిఎస్ఎఫ్ అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలు తీర్చడానికి అన్ని సమయాల్లోనూ అందుబాటులో ఉంటామన్నారు. రానున్న రోజుల్లో లైబ్రరీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డి.హితేష్, కె.అభిషేక్‌వర్మ, డి.రాకేష్, కన్వీనర్లు, అడ్వయిజర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు

పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం ఇంజరం గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు గ్రామ సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్ తెలిపారు. సోమవారం పంచాయతీకి నూతనంగా సమకూర్చిన ట్రాక్టర్‌ను సర్పంచ్ శివరామ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటివరకు తొట్టి రిక్షాల ద్వారా చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు చేర్చేవారమని, దానిని సులభతరం చేసేందుకు ట్రాక్టరు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎంపిటిసి సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు తడిచెత్త. పొడిచెత్తలను వేర్వేరుగా ఇచ్చి సహకరించాలని కోరారు. కూటమి నాయకులు వేగేశ్న భాస్కరరాజు, ఆకెళ్ల నాగేశ్వరరావు, మోర్త భైరవమూర్తి, కాట్రు వీరేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివగంగ దుర్గ, వార్డు సభ్యులు వేగేశ్న శ్రీనురాజు, కావూరి శ్రీను, మేడిశెట్టి సత్యన్నారాయణ, రేలంగి బాబి పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో మజ్జిగ పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-పిఠాపురం

వేసవికాలం, ఎండ తీవ్రత నుంచి కక్షిదారుల దాహార్తిని తీర్చేందుకు న్యాయవాది బొలిశెట్టి గౌరి మణి న్యాయస్థానాల ఆవరణలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీహరి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన న్యాయవాది గౌరిమణికి అభినందనలు తెలిపారు. న్యాయవాది గౌరి మణి మాట్లాడుతూ ఈ వేసవిలో ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల న్యాయ స్థానానికి వచ్చే కక్షిదారులకు ఉపశమనం కలిగించేందుకు తమ తల్లి సూర్యకాంతం జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశానన్నారు. ఈ నెల 19వ తేదీ వరకు మజ్జిగ పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయ రామేశ్వరి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.